మొదటి రోజు ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు
- మదనపల్లె డివిజన్ పరిధిలో 468 గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీవైఈఓ శ్రీరాం



వాల్మీకిపురం: పరీక్షలకు హాజరైన విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డివైఈఓ పురుషోత్తం తెలిపారు. మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలో 52 కేంద్రాల్లో 10075 మంది విద్యార్థులకు 9607 మంది హాజరయ్యారు. ఇందులో 468 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు ప్రారంభం కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో హాల్‌టిక్కెట్లు పరిశీలించి పరీక్షా కేంద్రానికి పంపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్ పరికరాలు అనుమతించలేదు. సెల్‌ఫోన్లు ఎవరికి అనుమతించలేదు. విద్యార్థుల కోసం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలను డివైఈఓ శ్రీరాం పురుషోత్తం పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, నెహ్రూ మున్సిపల్ పాఠశాల, ఆరోగ్య మాత, హోప్ ఉన్నత పాఠశాల, మథర్‌మీరా, జ్ఞానోదయ, శ్రీచైతన్య పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం :
ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభయ్యాయి. పరీక్ష కేంద్రాలను డివైఈఓ తనిఖీ చేశారు.

రామసముద్రంలో..
రామసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ , మోడల్‌స్కూల్ , కస్తూర్బా గాంధి పాఠశాలల్లో సోమవారం ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు జరిగాయి. 559 గాను 521 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు పరీక్ష కేంద్రాలలో కలిపి 38 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు తెలిపారు.

నిమ్మనపల్లెలో..
నిమ్మనపల్లె : పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమ్మనపల్లెలోని జడ్పీ హైస్కూల్, జడ్పీ హైస్కూల్ ఉర్దూ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంఈఓ లు ఎం.ఆర్ పద్మావతి, నారాయణ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.మండలంలోని నిమ్మనపల్లె తెలుగు, నిమ్మనపల్లె ఉర్దూ, బాలినాయనిపల్లె, రెడ్డివారిపల్లె, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల నుంచి 343 మంది హాజరు కావాల్సి ఉండగా,316 మంది మొదటి రోజు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓలు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పీలేరులో..
పీలేరురూరల్ : మండలంలో పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి తెలిపారు. మండలంలో 9 సెంటర్లలో మొత్తం 1598 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1521 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 77 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

తొలిరోజు 45 మంది గైర్హాజరు
వాల్మీకిపురం: మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష కోసం 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 692మంది విద్యార్థులకు గానూ 45 మంది గైర్హాజరయ్యారని, 647మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో వెంకటరత్నం తెలిపారు.

మొదటి రోజు ప్రశాతం
కేవీపల్లె : పదో తరగతి పరీక్షలు మొదటిరోజు మండలంలో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రెడ్డిబాషా తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకులతో మాట్లాడుతూ మండలంలో కేవీపల్లెలో ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీ హైస్కూల్, గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాల్లో మొత్తం 469 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 439 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 30 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

బి.కొత్తకోట: పదవ తరగతి తొలి పరీక్ష తెలుగుకు 41 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానికంగా ఏర్పాటుచేసిన నాలుగు పరీక్షా కే ంద్రాల్లో 861 మంది విద్యార్థులు పరీక్షను రాయాల్సి ఉండగా 820 మంది హజరయ్యారని ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్ కేంద్రంగా సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాల, మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 111 మంది విద్యార్థులకు 110 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏపీ మోడల్‌స్కూల్‌లో 162మందికి గాను 151 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు, మెడికల్ ఆఫీసర్ అనుపమ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.



రామసముద్రం : పరీక్ష కేంద్రం వద్దకు ముందుగానే చేరుకున్న విద్యార్థులు



మదనపల్లె : పరీక్ష కేంద్రం వద్ద రూము నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తంబళ్లపల్లె : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

క్లుప్తంగా

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం స్థానిక ప్రసన్న విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహార పక్షోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి సెక్టార్ పరిధిలోని తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను క్షుణంగా వివరించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ నాగరత్నమ్మతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

సమీవుల్లా మృతి పార్టీకి తీరనిలోటు

రామసముద్రం: మండల కేంద్రంలోని దిగువ పేటలో ఉన్న వైఎస్సార్ సీపీ యువనాయకుడు, కొయ్యలమండి సమీవుల్లా ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదనపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ మృతుడికి నివాళులర్పించారు. సమీవుల్లా మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవ రెడ్డి, మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడు, ముత్యల్లి, సిరాజ్ బాషా, మహబూబ్‌బాషా తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు



బహుమతులు అందజేస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : ఆర్టీసీలో ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు అని డీఎం కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో అత్యంత మెరుగైన ఇంధన పొదుపు, ఆదాయం సాధించిన సిబ్బందికి అభినందనలు తెలిపి క్యాష్ అవార్డులు అందజేశారు. క్యాష్ అవార్డులు అందుకున్న వారిలో డి.టి. రెడ్డి, ఇ. గోవిందు, కండక్టర్లు ఎస్.ఎస్. చంద్ర, నిర్మల లకు బహుమతులు ప్రదానం చేశారు. వీరిని మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్



కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లీషు, ఫారెన్ లాంగ్వేజెస్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. పార్వతి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఏ కంపరేటివ్ స్టడీస్ ఆఫ్‌ది సెలక్టెడ్ షార్ట్ ఫిక్షన్ ఆఫ్ ఆర్‌కె నారాయణ అండ్ విలియం ఫాల్కనర్ అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె: అక్రమంగా సారావిక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని బస్సునికొండ పంచాయతీ జన్మభూమి కాలనీ సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, దాడి చేశామన్నారు. సారా విక్రయిస్తుండగా గోపాల్ నాయక్ భార్య బాణావత్ సంపూర్ణమ్మ (37), ను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మద్యం పట్టివేత
బి.కొత్తకోట: మండలంలోని బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు సీఐ సూర్యానారాయణ సోమవారం తెలిపారు. మదనపల్లెలో ఉంటున్న వెంకటరమణ (60) కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 20 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి మద్దతు తెలుపుతున్న విశ్వ బ్రాహ్మణులు

వాల్మీకిపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడానికి కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ మీ బిడ్డ ద్వారా మీ ఇంట్లో లబ్ధి జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారని, ఆయన ఇచ్చిన ధైర్యంతోనే మీ వద్దకు వచ్చి మీరు పొందిన లబ్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌నే గెలిపించుకుంటే పథకాలన్నీ పొందవచ్చునన్నారు. చంద్రబాబు కూటమి చెప్పే మాటలు మోసపూరితమైనవని, ఏరుదాటి తెప్ప తగలవేసే విధానంతో అధికారం చేపట్టాలని యోచిస్తున్నారన్నారు. విశ్వబ్రాహ్మణ యూనియన్ అధ్యక్షులు మహేష్, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కుమార్ ఆచారి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. అన్ని కుల వృత్తులకు అందించే ఆర్థిక సహాయాన్ని విశ్వ బ్రాహ్మణులకు కూడా అందించాలని ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి, విశ్వ బ్రాహ్మణుల సంఘం సభ్యులు నాగేంద్రాచారి, చంద్రోశేఖర్ ఆచారి, కృష్ణమాచారి, చంద్రమౌళి ఆచారి, ఆనందాచారి, బాబు ఆచారి, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం



ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న చింతల సాయిక్రిష్టారెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని చింతల సాయిక్రిష్టారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నాయక్‌వీధి, ఎన్టీఆర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధి అనేది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోనే జరిగిందన్నారు. గత ప్రజాప్రతినిధులు ఓట్లు దండుకునేందుకు కొబ్బరికాయలు కొట్టి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రజలను మాయ చేసి మోసం చేసేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. పేద ప్రజల అభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ కలీమ్, సైఫుల్లా, మస్తాన్, సాగుబడి ఆనంద రెడ్డి, షాహెద్, సాధిక్, అలీ, ఖదీర్, జవహర్, మహబూబ్‌బాషా, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

పెద్దతిప్పసముద్రం: కర్ణాటక రాష్ట్రం నుంచి దిగుమతి అయ్యే మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని ములకలచెరువు ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్ అన్నారు. సోమవారం సాక్షి పత్రికలో ‹విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్మకాలు› వెలువడిన వార్తపై సీఐ స్పందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్‌ఈబీ సిబ్బందితో పాటు పెద్దతిప్పసముద్రం పోలీసుల సమన్వయంతో మండల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను నిత్యం తనిఖీ చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రవాణా చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు తమ తనిఖీల్లో పట్టుబడిన 248 లీటర్ల మద్యంతో పాటు నాలుగు వాహనాలను సీజ్ చేసి 20 మంది నిందితులపై 20 కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మద్యం అక్రమ రవాణాలో ఎస్‌ఈబీ సిబ్బంది హస్తం ఉన్నట్లు రుజువైతే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ములకలచెరువు ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా 9440902534 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే వేటు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాఘవేంద్ర

కురబలకోట: ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని, అతిక్రమిస్తే వేటు తప్పదని తంబళ్లపల్లె నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎస్. రాఘవేంద్ర హెచ్చరించారు. సోమవారం నియోజక వర్గ స్థాయిలో నోడల్ అధికారులు, తహశీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులకు కురబలకోట మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలన్నారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ప్రతి ఒక్కరూ నడచుకోవాలన్నారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రాజకీయ పార్టీకి, నాయకుడికి వత్తాసు పలకరాదన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి పరిస్థితులను అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు తగిన సమాచారం అందజేయాలన్నారు. డీస్పీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీనారసింహుడు



కల్పవృక్షవాహనంపై విహరిస్తున్న స్వామివారు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని కల్పవృక్ష వాహనంపై వైభవంగా ఊరేగించారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం వేకువ జామునే మూలవర్లకు శుద్ధితో మాల సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామి ఊంజల్‌సేవ కానిచ్చారు. వాహన మండపంలో స్వామి వారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివార్లు కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి గ్రామపుర వీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగారు. అనంతరం సింహ వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి గ్రామపుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి స్వామివారి సేవలు తరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని గ్రామంలోని రోడ్డుకు కిరువైపులా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ జి.సరస్వతమ్మ మృతికి నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న నిసార్‌అహ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు

మదనపల్లె : వలసపల్లె పంచాయతీ సర్పంచ్ జి.సరస్వతమ్మ(74) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. సరస్వతమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వలసపల్లె పంచాయతీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో సర్పంచ్ సరస్వతమ్మ, ఆమె కుమారుడు నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి, కురవంక, కొత్తవారిపల్లె సర్పంచ్‌లు చలపతి, బోర్‌వెల్‌మహేష్, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షులు మిద్దింటికిషోర్, వెలుగుచంద్ర, తట్టినాగరాజరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కత్తిరాజు తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేటి నుంచి గట్టు వెంకటరమణస్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో గట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి తిరునాల మంగళవారం అంకురార్పణతో ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణం, సూర్యప్రభోత్సవం, 21న సింహ వాహనం, 22న శేష వాహనం, 23న హనుమంత వాహనం, 24న గజవాహనం, 25న కళ్యాణోత్సవం , గరుడోత్సవం, 26న రథోత్సవం, 27న దోపోత్సవం, 28న వసంతోత్సవం, ధ్వజా ఆవరోహణం 29న పూలంగిసేవ, 30న శయనోత్సవం, 31న సుప్రభాత, సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు , కార్యనిర్వాహకులు మాట్లాడుతూ స్వామివారి సేవలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులుకావాలని కోరారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని జాండ్లపల్లె పంచాయతీ మూరేవాండ్లపల్లె, ఆవులయ్యగారిపల్లె, సూర్యానాయక్ తాండా, హరిజనవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు ఘనవిజయం అందించాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే రాష్ట్రానికి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని విన్నవించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు చేప్పే మాయమాటలు నమ్మి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ, ఉప సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ కృష్ణమ్మ బాబునాయక్, మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి ఏఎంసీ మాజీ ఛైర్మన్ కడప గిరిదర్‌రెడ్డి, నాయకులు ఎస్.వి.చలపతి, కుసుమశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఆనంద్, చక్రధర్, మోహన్, నరసింహులు, కార్తీక్, లక్ష్మీనారాయణ, రామ్మూర్తినాయక్ రామ్‌నాయక్, చిట్టేనాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ చీకలబైలు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, కర్ణాటక రాష్ట్రం, జిగని తాలూకా, హోలీ మంగళ పోస్ట్, కైలాస హళ్లి కి చెందిన వీరభద్ర కుమారుడు వి మోహన్ కుమార్ (37), వృత్తిరీత్యా డ్రైవర్ కాగా, ఆదివారం కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుని వద్ద నుంచి కర్ణాటక కు చెందిన మూడు ఫుల్ బాటిల్స్ (ఒక్కొక్కటి 750 ఎం ఎల్)విస్కీ మద్యం, నాలుగు బాటిళ్లు (90 ఎం.ఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.5,045 ఉంటుందని చెప్పారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎస్టేట్ శివాజీ నగర్ లో సురేష్ నాయక్ భార్య మూడే రాజమ్మ (35) తన ఇంటి వెనక వైపున సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

వైద్య సేవలపై తనిఖీ



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి పంచాయతీ చారావాండ్లపల్లిలో ఆరోగ్య సేవలపై జిల్లా వైద్య బృందం తనిఖీ చేసినట్లు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీపీఎంవో డాక్టర్ రియాజ్ బేగ్ ఆధ్వర్యంలో గణాంకాధికారి ఓబుల్ రెడ్డి అధ్యక్షతన చారావాండ్లపల్లిలో తనిఖీ చేపట్టారు. అనంతరం గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులపై అవగాహన కల్పించారు. అలాగే రక్తహీనత ఎక్కువగా ఉంటే కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, మునీశ్వర్, సుధాకర్, భానుబి, సౌజన్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాయచోటి అర్బన్ : వేసవిలో ప్రజల తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు మరిన్ని చలివేంద్రాల ఏర్పాటు చేయాల్సిన అవసరమం ఉందని వైద్యుడు బయారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఎస్ఎన్ కాలనీలోని సాయినాథ్ మెన్స్‌వేర్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 4 నుండి 5లీటర్ల మంచినీరు సేవించని పక్షంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అందరూ గుర్తెరిగి పట్టణంలోని పలుకూడళ్లలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా ఔత్సాహికులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మహమ్మద్, నాగార్జునాచారి, చాన్ బాషా, సభ్యులు వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, వెంకటచలపతి, భాను, అనిల్‌శెట్టి, నందిని ట్రావెల్స్‌నాయక్, దాత నరేంద్ర కుమార్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వానికి అనుమతులు తప్పనిసరి

రాజంపేట : రాజకీయ పార్టీలు తమ ప్రచార పర్వానికి అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని రాజంపేట రిటర్నింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి మోహనరావు స్పష్టం చేశారు. సోమవారం తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఊరేగింపులు, సభలకు డీఎస్పీ అనుమతి ఉండాలన్నారు. తాత్కలికంగా ఏర్పాటు చేసుకునే పార్టీ కార్యాలయానికి స్థానిక డీఎస్పీ, వ్యయ పరిశీలకుల వారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. వాహనం ఉపయోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల అనుమతి ఉండాలన్నారు. లౌడు స్పీకర్‌తో రోడ్ల కూడలిలో మీటింగ్‌లు, స్టేజీ, బారికేడ్ల నిర్మాణానికి స్థానిక డీఎస్పీ వారికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లౌడు స్పీకరు లేకుండా మీటింగ్ నిర్వహణకు స్థానిక ఎస్‌డీపీఓ, వ్యయ పరిశీలకుల అనుమతి తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో తిరిగి ప్రచార వాహనాలకు కలెక్టర్, పూర్తి అసెంబ్లీ ఏరియాలో తిరిగే వాహనానికి, అసెంబ్లీ ఏరియా పరిధిలో తిప్పే ప్రచార రథాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి ఉండాలన్నారు. కరపత్రాలు పంపిణీ కోసం వ్యయ పరిశీలకుల అనుమతి, బ్యానర్ల, జెండాల ప్రదర్శనతోపాటు పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్ల ఏర్పాటుకు డీఎస్పీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు.